ఐఐఐటీకి గురుకుల విద్యార్థిని నందిని



కీసర, జూలై5(ఆంధ్రజ్యోతి): కీసరలోని బీసీ గురుకుల విద్యార్థిని నందిని ఆకుల దేవికనందిని బాసర ఐఐఐటీకి ఎంపికైంది. గురుకుల పాఠశాలలో చదువుతున్న నందిని టెన్త్ ఫలితాల్లో 581 మార్కులు సాధించడంతో సీటు లభించింది. ఈ మేరకు శనివారం పాఠశాల హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లో జరిగిన జగన్నాథ రథ యాత్రలో భక్తుల కోలాహలం

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో శనివారం జగన్నాథ రథయాత్ర కనుల పండువగా జరిగింది. భక్తియోగా క్లబ్ ఆధ్వర్యంలో శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర టౌన్‌షిప్‌లోని ప్రధాన రహదారుల నుంచి తిరిగి మళ్లీ ఆలయం వద్దకు చేరుకుంది. ఈసందర్భంగా పలువురు భక్తులు హరేరామ హరేకృష్ణ అంటూ భజనలతో రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమంలో అమోఘ్ దేశపతి, శ్రీమాన్ రాధేశ్యామ్ ప్రభు, మాధవ గోపినాథ్ దాస్, వాసుదేవ కృష్ణ దాస్ తదితరులు పాల్గొన్నారు.

-ఘట్‌కేసర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



దట్టి సమర్పిస్తున్న పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

మత సామరస్యానికి మొహర్రం ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మైనార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని జామే మసీద్ దగ్గర పీర్ల మసీదులో బీబీ ఫాతిమా, అలీ అబ్బాస్, ఇమామ్ ఖాసీమ్ పీర్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూలు, దట్టి సమర్పించారు. అనంతరం ఆయన నేతలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎస్ఎం.గౌసన్, వాహేద్ రజా, అబ్దుల్ సత్తార్, రహమత్‌ఖాన్, అమీర్‌ఖాన్, సయ్యద్ మునీర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

-కొడంగల్, జూలై 5(ఆంధ్రజ్యోతి):



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అర్హులైన రైతులందరికీ రుణాలివ్వాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్/ధారూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ రైతుకు సకాలంలో బ్యాంకర్లు రుణాలు అందించాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. మహిళలు, రైతు రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లో త్రైమాసిక, డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత, స్త్రీలకు ఉన్న ఉపాధి అవకాశాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందించాలని తెలిపారు. బ్యాంకులకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరానికి గాను రూ.8,527.05 కోట్లు నిర్ధారించాబడిందని తెలిపారు. అందులో రూ.7,432.53 కోట్లు ప్రాధాన్యత రంగాలకు రూ.5,633.07 కోట్లు వ్యవసాయ రంగానికి నిర్ధారించబడినదని తెలిపారు. సమావేశంలో పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, నా బార్డ్ మేనేజర్ హర్ష, జిల్లా పరిశ్రమల అధికారి మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ బాబు మోజస్, వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు పరిశీలించాలి

క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను సేకరించాలని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. ధారూరులోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో శనివారం నిర్వహించిన బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్ల జాతీయ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల వివరాల మార్పులు, చేర్పులపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. మరణించిన వారి పేర్లను తొలగించాలన్నారు. కుటుంబ సభ్యుల పేర్లన్నీ ఒకే బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింహులు, ఎన్నికల డీటీ అనిత, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

కళాశాలలకు మహర్దశ!

జూనియర్ కాలేజీల నిర్వహణకు నిధులు మంజూరు

- ఎనిమిది కాలేజీలకు రూ.2 కోట్లు విడుదల
- చేపట్టనున్న సివిల్, విద్యుత్, శానిటరీ మరమ్మతులు
- తాగునీటి సౌకర్యం, గ్రీన్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు ఏర్పాటు
- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగనున్న పనులు
- పర్యవేక్షించనున్న కలెక్టర్, ఇంటర్ విద్య నోడల్ అధికారి

సమస్యలు, సదుపాయాల కొరతతో సతమతమవుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మహర్దశ పట్టింది. సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతున్న కాలేజీల దశ మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రభుత్వ కళాశాలలకు ఏటేటా ఆదరణ పెరుగుతుండంతో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించింది. జిల్లాలో మొత్తం 13 కళాశాలలు ఉండగా 8 కళాశాలల్లో మరమ్మతు పనులు, సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. చాలా సంవత్సరాల తర్వాత నిర్వహణకు నిధులు మంజూరు కావడం గమనార్హం.



వికారాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దశాబ్ద కాలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహణకు నిధులు మంజూరు చేయడం ఇదే తొలిసారి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కనీస మరమ్మతులకు నోచుకోక.. మౌలిక వసతులు కరువై విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కళాశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకోగా, తరగతి గదుల్లో పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారాయి. తరచూ విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అంతే కాకుండా తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు శానిటరీ పనులు చేపట్టాల్సి ఉంది. అత్యవసర పనులకు కొందరు ప్రిన్సిపాళ్లు తమ చేతి నుంచి ఖర్చు చేస్తున్న పరిస్థితులూ ఉన్నాయి. ఇదిలా ఉంటే, జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కొరవడి విద్యార్థులు, అధ్యాపకులు ఇక్కట్లు పడుతున్న విషయం గుర్తించిన ఇంటర్ విద్య కమిషనర్.. జూనియర్ కళాశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతులు, కల్పించాల్సిన వసతులపై కళాశాలల వారీగా నివేదిక తెప్పించుకుని ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...

కళాశాల వారీగా నిధుల వివరాలు

కళాశాల	మంజూరైన నిధులు
నవాబ్‌పేట్	రూ. 35.00 లక్షలు
వికారాబాద్	రూ. 18.50 లక్షలు
తాండూరు	రూ. 43.50 లక్షలు
పెద్దేముల్	రూ. 32.50 లక్షలు
పరిగి	రూ. 17.00 లక్షలు
మర్పల్లి	రూ. 15.00 లక్షలు
మోమిన్‌పేట్	రూ. 16.00 లక్షలు
దోమ	రూ. 28.80 లక్షలు
మొత్తం	రూ.200.30 లక్షలు



కళాశాలల్లో మరమ్మతు పనులు త్వరలోనే పూర్తి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టడానికి, వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ కళాశాలలకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మరమ్మతు పనులతో పాటు తాగునీటి సదుపాయం, విద్యుదీకరణ, శానిటరీ పనులు చేపట్టనున్నారు. కలెక్టర్ నేతృత్వంలో పనులు త్వరగా జరిగే విధంగా కృషి చేస్తాం.

- శంకర్‌నాయక్, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి, వికారాబాద్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఆలయ అభివృద్ధిపై సమీక్ష

కొడంగల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సమీక్షించారు. శనివారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి ఆలయ ఆవరణలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల పురోగతి, పనుల తీరును పరిశీలించారు. అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు అధికారులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఈవో రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

మోమిన్‌పేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్ డబ్బులు విడుదల చేయాలని అలాగే, గ్రామాల్లో సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం శ్మశాన వాటికలను ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు.

ఆమెది దళిత వ్యవసాయ కూలీ కుటుంబం. చదువుపై ఆసక్తితో ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. చిన్ననాటి నుంచి ప్రజా సమస్యలను చూస్తూ పెరిగింది. దాంతో అప్పటి నుంచే పుస్తకాలు చదవడం ప్రారంభించింది. సాహిత్యాన్ని ఆకలింపు చేసుకొని తాను రచనలను మొదలుపెట్టింది. తాను రచించిన నవలలు పర భాషల్లోనూ అనువాదం కావడంతో దేశవ్యాప్త ప్రాచుర్యం పొందాయి. అనేక ఉత్తమ పురస్కారాలు సైతం ఆమెను వరించాయి. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రామానికి చెందిన సాహితీవేత్త, రచయిత్రి గోగు శ్యామల ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

ఆస్ట్రేలియాలో అవార్డు అందుకుంటున్న శ్యామల(ఫైల్)



Sunday Special

శభాష్.. శ్యామల!

- నవలా రచనల్లో ఆమె మేటి
- మహిళా సాహిత్యం, సాధికారతపై అధ్యయనం
- ప్రాచుర్యం పొందిన 'వాడ పిల్లల' కథలు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళా పురస్కారం
- గోగు శ్యామల సాహిత్య ప్రయాణంపై కథనం

తాండూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ గ్రామానికి చెందిన బాలయ్య, అనంతమ్మ దంపతుల రెండో సంతానం శ్యామల. వారిది వ్యవసాయ కుటుంబం. 1969లో జన్మించిన ఆమె చిన్నతనం నుంచే పరిచయమున్న తాండూరు మండలం చెనిగేష్‌పూర్ గ్రామానికి చెందిన బైండ్ల విజయ్‌కుమార్‌ను 1990లో పెళ్లి చేసుకుంది. అభ్యుదయ భావాలు ఉన్న విజయ్‌కుమార్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పని చేశారు. వీరికి ఇరువురు కుమారులు పెద్దకుమారుడు రవికాంత్ ఢిల్లీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా చిన్న కుమారుడు రోషన్ యూకేలో ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డాడు. దళిత కుటుంబం నుంచి

మిగతా 7వ పేజీలో...

అంబేడ్కర్, పూలే ఆదర్శం



డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే నాకు స్ఫూర్తి. నేను చదువుకునే రోజుల్లో ప్రజల సమస్యలు చూడటం, పాటలు పాడటం, ప్రసంగాలు చేయడం వల్ల రచయితగా మారిపోయాను. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో పురస్కారం అందుకోవడం సంతోషానిచ్చింది.

-గోగు శ్యామల

రేపు లోపాల గుర్తింపునకు స్క్రీనింగ్ క్యాంపులు

వికారాబాద్, పూడూరులో ఏర్పాట్లు



డీఎంహెచ్‌వో లలితాదేవి

వికారాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, పెద్దల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, ప్రమాదవశాత్తు ఏర్పడిన అంగవైకల్యం లోపాలను సరిదిద్దడం కోసం స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి లలితాదేవి తెలిపారు. జూలై 7 సోమవారం ఆకార్ ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. పుట్టుకతో వచ్చే లోపాలైన గ్రహణం మొర్రి, అంగిలిలో లోపాలు, నాలుక అత్తుకొని ఉండడం, చెవులు అసలు లేక పోవడం, కనుబొమ్మలు సరిగ్గా అభివృద్ధి చెందక పోవడం, దవడ కండరాలు సరిగా అభివృద్ధి చెందకపోవడం, ప్రమాదాలు జంతువుల కాటు వల్ల ఏర్పడిన లోపాలను శస్త్ర చికిత్స ద్వారా సరిదిద్దుతారు. క్యాంపులో స్క్రీనింగ్ అనంతరం అవసరమైన వారికి ఆకార్ ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జోరుగా వరినాట్లు

- సాగు పనుల్లో అన్నదాతలు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- ఘట్‌కేసర్ మండలంలో 4 వేల ఎకరాల్లో వరిసాగు



మర్రిపల్లిగూడలో నాట్లు వేస్తున్న మహిళలు

ఘట్‌కేసర్ రూరల్, జూలై5(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు. ఘట్‌కేసర్ మండలంలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 70శాతం దొడ్డు రకాలు, 30 శాతం సన్నాలను సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలో దాదాపు 4 వేల ఎకరాలలో వరిసాగు చేయడానికి ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్నారు. కొండాపూర్, అవుశాపూర్, అంకుశాపూర్, ఘట్‌కేసర్, చందుపట్లగూడ, బొక్కొనిగూడ గ్రామాల్లో రైతులు ముందుగాను నారు పోసుకొని వరినాట్లు పూర్తి చేశారు. మూసీ పరీవాహక ప్రాంతాలైన ఏదులాబాదు, పోతరాజిగూడ, కొర్రెముల, ప్రతాప్‌సింగారం, వెంకటాపూర్, మక్తా, సాదాత్ అలీగూడ, ముత్వేల్లిగూడ, కచవానిసింగారం గ్రామాలలో ఆలస్యంగా నారుపోసుకోవడంతో

మిగతా 8వ పేజీలో...

పూడూరులో భారీ వర్షం



తిర్మలాపూర్‌లో కురుస్తున్న వర్షం

పూడూరు/యాలాల, జూలై 5, (ఆంధ్రజ్యోతి): పూడూరు, యాలాల మండలాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రెండు, మూడు రోజులుగా చినుకులు రాలుతున్నప్పటికీ పెద్ద వర్షం మాత్రం పడలేదు. శనివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా, సాయంత్రం వేళ ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో పంటలకు మేలు జరిగిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోతుల వాగు కబ్జాపై విచారణ

- రియల్టర్ వాగు ఆక్రమణతో పాటు, కెనాల్‌ను ధ్వంసం చేసినట్లు గుర్తింపు
- పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్న అధికారులు

6

మొక్కజొన్న.. పోషకాలు మిన్న



- సమృద్ధిగా విటమిన్ బీ12, ఫోలిక్ యాసిడ్, ఐరన్
- వర్షాకాలంలో భలే గిరాకీ

8

నాణ్యతా లోపం.. సీసీ రోడ్లు ధ్వంసం

- వేసిన కొన్నాళ్లకే పూర్తిగా లేచిపోయిన సీసీ
- మట్టి రోడ్లుగా మారుతున్న వైనం.. ప్రజల ఇబ్బందులు
- క్వాలిటీపై అధికారులు పట్టించుకోకే ఈ పరిస్థితి

యాచారం, జూలై 5(ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ఏళ్లపాటు మన్నవలసిన ప్రజా పనులు కొన్నేళ్లకే పాడవుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు మట్టి రోడ్లుగా మారాయి. రోడ్లు పగుళ్లిచ్చి ఎక్కడికక్కడ సీసీ లేచిపోతున్నాయి. సీసీ వేసిన సమయంలో అధికారులు నాణ్యత ప్రమాణాలు చూడకుండానే బిల్లులివ్వడంతోనే నేడు ఈ పరిస్థితి నెలకొంది. చిన్నతూండ్లలో పదేళ్ల క్రితం బీసీ వాడలో వేసిన సీసీ రోడ్డు ధ్వంసమైంది. పంచాయతీ ఆఫీసుకు కొద్ది దూరంలో సీసీ పాడై భారీ గుంతలేర్పడ్డాయి. వాననీరు రోడ్డుపై నిలుస్తూ గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్డు కాస్తా మట్టి రోడ్డులా మారింది. తాటిపర్తిలో బీసీ వాడలో సీసీ ధ్వంసమైంది. సీసీ రోడ్డు వేసిన కొద్ది రోజులకే రోడ్డు తవ్వి భూగర్భ డ్రైనేజీ పైపులు వేశారు. దీంతో మట్టి రోడ్డుగా మారింది. గొల్లగూడలో సీసీ రోడ్డు పాడవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నానక్‌నగర్‌లో సీసీ రోడ్డు తగినంత ఎత్తుగా వేయక వర్షానికి మట్టి కొట్టుకొచ్చి రోడ్డుపై చేరుతోంది. కుర్మిద్దలో పలు వాడల్లో సీసీ రోడ్డు ధ్వంసమైంది. తండా వెళ్లే దారిలో సీసీ రోడ్డు పాడవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చౌదర్‌పల్లి చౌరస్తాలో సీసీ రోడ్డు పాడై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల కాలనీల్లో సీసీ రోడ్లు ధ్వంసమయ్యాయి. కుర్మిద్ద తండాలో సీసీ రోడ్డు పాడయిపోయింది. మేడిపల్లిలో సీసీ రోడ్డు మొత్తం పెళ్లలుగా లేచిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, కనీసం ప్యాచ్ వర్కయినా చేయించడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మల్కీజ్‌గూడలో సీసీ రోడ్డు ఖరాబైందని అధికారులకు చెప్పినా బాగు చేయించడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. యాచారంలో ప్రధాన సీసీ రోడ్డుపై పలుచోట్ల గుంతలేర్పడ్డాయి. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో స్థానికులు సిమెంట్ వేయించి బాగు చేశారు. అధికారులు సీసీ రోడ్లు పాడైనచోట మరమ్మతులు చేయించాలని, నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చిన్నతూండ్లలో మట్టి రోడ్డులా మారిన సీసీ రోడ్డు

పాడైన సీసీ రోడ్లను వెంటనే బాగు చేయించాలి



పదేళ్ల కింద వేసిన సీసీ రోడ్లు పాడయ్యాయి. బురుజు వెనకబస్తీలో సీసీ లేచిపోయి మట్టిరోడ్డుగా మారింది. అక్కడ కొత్తగా సీసీ రోడ్డు వేయించేందుకు నేను చాలా వరకు ప్రయత్నం చేశాను. పంచాయతీలో నిధుల్లేక సీసీ వేయలేదు. అధికారులు నిధులిచ్చి సీసీ రోడ్లను బాగుచేయాలి. ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం.

– బి.రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కుర్మిద్ద

నిధుల మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు



గ్రామంలో రూ.రెండున్నర కోట్లతో కొత్తగా సీసీ రోడ్లు బాగుచేయించాలని, పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరాం. నిధులు కేటాయించాలని విన్నవించాం. త్వరలోనే అవసరమైన సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

– డి.రమేశ్, మాజీ సర్పంచ్, తాటిపర్తి



తాటిపర్తిలో సీసీ లేచిపోయిన రోడ్డు

పోతులవాగు కబ్జాపై విచారణ



పోతులవాగును పరిశీలిస్తున్న ఈఈ మధుసూదన్‌రెడ్డి, అధికారులు

ధారూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అల్లాపూర్ శివారులో పొలం కొన్న ఓ రియల్టర్ పక్కనే ఉన్న వాగును కబ్జాచేసి కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌ను ధ్వంసం చేశాడు. దీనిపై రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు శనివారం వాగును, కెనాల్‌ను పరిశీలించారు. పోతులవాగులో భారీగా మట్టిపోసి, రాళ్లు పేర్చి కబ్జాచేసి పొలంలో కలుపుకున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌నూ ధ్వంసం చేశాడు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి, డీఈలు రవికుమార్, భాస్కర్‌గౌడ్, రెవెన్యూ అధికారులు పోతులవాగును సర్వే చేశారు. రియల్టర్ వాగును కబ్జా చేసినట్టు గుర్తించారు. వాగు కబ్జాతో పాటు, కెనాల్‌ను ధ్వంసం చేసిన రియల్టర్ ఎవరో వివరాలు సేకరిస్తున్నామని ఈఈ తెలిపారు. వాగు, కెనాల్ ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే అటవీ భూమిని సైతం కబ్జా చేశాడని అల్లాపూర్ రైతులు తెలిపారు. సర్వే చేస్తే అటవీ భూమి ఎంత ఆక్రమించాడో తెలుస్తుందని అధికారులను కోరారు. కాగా సర్వే నంబరు 11ను సర్వే చేయించేందుకు డీఎఫ్‌వోకు నివేదించామని ధారూరు ఫారెస్టు రేంజర్ రాజేందర్ తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీకి 8 మంది విద్యార్థుల ఎంపిక

మాడ్గుల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇర్విన్ పాఠశాల విద్యార్థులు 8 మంది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్ సాధించి బాసర ట్రిపుల్ ఐటీ కోర్సుకు ఎంపికయ్యారని హెచ్ఎం పర్వతాలు శనివారం తెలిపారు. అశ్విని, సౌమ్యశ్రీ, స్పందన, రమ్యశ్రీ, జునైద్, స్నేహిత్, రోహిత్, వైష్ణవి ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారని చెప్పారు.



ఎంపికైన ఇర్విన్ హైస్కూల్ విద్యార్థులు

ఘనంగా జగన్నాథ రథయాత్ర



మేడ్చల్‌లో నిర్వహిస్తున్న జగన్నాథుడి రథం ఊరేగింపు

మేడ్చల్ టౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పూరీ జగన్నాథస్వామి రథ యాత్రను శనివారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. రథ యాత్రను పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభించి బాలాజీనగర్, ఉమానగర్, జాతీయ రహదారి మీదుగా నిర్వహించి ప్రజలకు స్వామి వారి దర్శనం కల్పించారు. యాత్రలో స్థానికంగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన గా కృష్ణ పరమాత్మ నామస్మరణంతో పట్టణం మార్మోగింది.

స్పీకర్‌ను విమర్శిస్తే ఊరకోం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను విమర్శించేస్థాయి మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ది కాదని మండల కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో పార్టీ సీనియర్ నాయకులు రామేశ్వర్, దివాకర్, సురేశ్‌లు మాట్లాడారు. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే ఆనంద్.. స్పీకర్‌ను విమర్శిస్తూ.. రాజ్యాంగ బద్ధ పదవీలో ఉన్న ఆయన రాజకీయాలు ఎలా ఎలా మాట్లాడతారంటూ వ్యాఖ్యానించడం పూర్తిగా అసంబద్ధం అన్నారు. స్పీకర్ పదవిలో ఉన్నా ఆయనను ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజల గురించి తప్పక మాట్లాడతారనే విషయం మాజీ ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలన్నారు. ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశంలోనే మాట్లాడారన్నారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యేగా వికారాబాద్ నియోజకవర్గానికి రూ.800కోట్లతో రోడ్ల పనులు చేయిస్తున్నా రని తెలిపారు. ఆనంద్ తన పదవీ కాలంలో సొంత, అనుచరుల ఆస్తులు పెంచుకున్నారే ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మండలంలో రోడ్ల వెడల్పునకు రూ.12వేల కోట్లు మంజూరు చేయించారని, మండలానికి 780 ఇళ్ల మంజూరు అయ్యాయని తెలిపారు. ఎవరైనా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ నాయకుడు రాములుయాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లేశ్‌యాదవ్, నాయకులు ఉప్పరి నాగేశ్, రాచన్న, అశోక్‌రెడ్డి, అశోక్, అబ్రహం, రతన్, శ్రీనివాస్, వినోద్‌స్వామి, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

కేజీబీవీలో బోర్ వేయించిన తహసీల్దార్



రిగ్గుకు టెంకాయ కొడుతున్న ఎస్‌వో శ్వేతారెడ్డి

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల : గత పదేళ్లగా చేవెళ్ల లోని కేజీబీవీ విద్యార్థినులు నీటి కోసం పాట్లు పడుతున్నారు. మిషన్ భగీరథ నల్లా ఏర్పాటు చేసినా నీరు సరిపోవడం లేదు. పదేళ్ల నుంచి రోజూ ట్యాంకర్ తెప్పించుకుంటున్నారు. ట్యాంకర్ సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నారు. కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించిన సమయాల్లో ప్రజాప్రతినిధులకు, అధికారులకు విద్యార్థినులు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కూడ మొరపెట్టుకున్నారు. రెండు రోజుల క్రితం చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య కేజీబీవీని సందర్శించారు. అక్కడ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యను తెలుసుకున్నారు. రెండు రోజుల్లో బోరు వేయిస్తానని బాలికలకు భరోసా ఇచ్చారు. మాట ప్రకారం ఆయన శనివారం బోరు బండిని కేజీబీవికి పంపించారు. సంవృద్ధిగా నీరు పడాలని దేవుడిని ప్రార్థిస్తూ కేజీబీవీ ఎస్‌వో శ్వేతారెడ్డి కొబ్బరికాయ కొట్టి రిగ్గు మిషన్‌ను ప్రారంభించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు భూపాల్

ఆదిభట్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని జూలై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. శనివారం బొంగ్లూర్ ఓఆర్ఆర్ సర్కిల్ వద్ద హెచ్ఎండీఏ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం తెచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని, సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. ఏపీలో ఇటీవల మంత్రి వర్గ సమావేశంలో 8గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచారని గుర్తుచేశారు. సమ్మెలో కార్మిక లోకం పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, కార్మికులు బిక్షపతి, కుమార్, ప్రభాకర్, రాజు, నరసింహ పాల్గొన్నారు.

వైభవంగా మొహర్రం



పీర్ల వద్ద వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కడ్తాల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తమాదారంలో మొహర్రం పండగ శనివారం రాత్రి ప్రారంభమైంది. పీర్ల చావిడిని ముస్తాబు చేశారు. ఏటా మొహర్రం పండగ వేడుకలను ఇక్కడ భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. పీర్ల పండగలో కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ఎంపీపీ ఆనంద్ పాల్గొన్నారు. వారు పీర్లను దర్శించుకొని కొద్దిసేపు అసోయ్ దులా ఆడారు. ముస్లింలు వారిని శాలువాలతో సన్మానించారు. కులమతాలకతీతంగా పీర్ల పండగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, మాజీ ఎంపీటీసీ మంజులచంద్రమౌళి, మాజీ ఉపసర్పంచ్ గణేశ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్అలీ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్, రిపోర్టర్ రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ముస్లింలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంద కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి

షాద్‌నగర్ అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలో రూ.వంద కోట్లతో ఏళ్లపాటు మన్నేలా వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. శనివారం షాద్‌నగర్‌లోని ఆరు వార్డుల్లో 21.59కోట్లతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మూడవ వార్డులో మూడు కోట్లతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు, ఆరో వార్డులో సీసీ రోడ్లు, ఏడో నాలుగు సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు, తొమ్మిదో వార్డులో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి పనులు, పార్కు అభివృద్ధి, పదో వార్డులో రోడ్లు, యూజీడీ పనులు, 21వ వార్డులో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయిస్తామని, పట్టణాభివృద్ధి దశల వారీగా ముందుకు సాగుతుందని వీర్లపల్లి తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ చైర్మన్ ఎ.విశ్వం, కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీం, కె.చెన్నయ్య, జమృద్‌ఖాన్, రఘునాయక్, తిరుపతిరెడ్డి, సర్వర్‌పాషా, శ్రావణి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవి, ముబారక్, శ్రీశైలంగౌడ్, ప్రవీణ్, యాదగిరి, టీడీపీ నాయకుడు కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నిర్వహణ లేని మినీ ఆడిటోరియం



ఎన్కతల గ్రామంలో శిథిలావస్థకు చేరిన మినీ ఆడిటోరియం

మోమిన్‌పేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎన్కతలలో 2019లో రూ.19లక్షల ఎంపీ నిధులతో మినీ ఇండోర్ ఆడిటోరియాన్ని నిర్మించారు. ఇందులో బ్యాడ్మింటన్, క్యారమ్స్ చెస్ లాంటి ఆటలాడేందుకు క్రీడాసామగ్రి సమకూర్చారు. కొన్నేళ్లుగా నిర్వహణ లేక ఆడిటోరియం శిథిలావస్థకు చేరింది. యువతీ, యువకులు, విద్యార్థులు ఆటలాడడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

600 మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరం ప్రారంభానికిత జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 5 (ఆంధ్రజ్యోతి):ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటుచేసిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రజల కోసం ఏర్పాటు చేసిన శిబిరానికి ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాల నుంచి సుమారు 800మంది హాజరయ్యారు. రాఘవేందర్‌రెడ్డితో కలిసి రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. జడ్జి శ్రీదేవి సందర్శించి నిర్వాహకులను అభినందించారు. చెన్నై శంకర నేత్రాలయ సహకారంతో ఈ శిబిరంలో 600 మందికి కంటి పరీక్షలు చేశారు. 300 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 35 మందికి దృష్టిలోపమున్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ నెల 13వ తేదీ వరకు శిబిరాన్ని నిర్వహిస్తామని రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు దీనికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంధత్వ నివారణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకుపోతున్నట్లు చెప్పారు. నేత్ర సంరక్షణలో అజాగ్రత్త తగదన్నారు. ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్ రెడ్డి, బాల్‌రాజ్, రమేశ్, శ్రీరాములు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న వెంకటనారాయణ

కేశంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేకాధికారిగా మెప్మా పీడీ వెంకటనారాయణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు మండల సిబ్బందితో సమావేశం నిర్వహించి, అధికారులను పరిచయం చేసుకున్నారు. శాఖలవారీగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చౌలపల్లిని సందర్శించిన నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. బిల్లులు వచ్చాయా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నర్సరీని పరిశీలించారు. మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఏపీవో అజీజ్, కార్యదర్శి వెంకటేష్, మాజీ సర్పంచ్ గూడ వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న చర్లగూడ గ్రామానికి వెళ్లే బ్రిడ్జి పనులు

- అసంపూర్తి పనులతో ప్రజల ఇబ్బందులు

షాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కింద నిర్మాణం ప్రారంభించిన బ్రిడ్జి పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చర్లగూడకు వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి 2022లో ప్రభుత్వం రూ.7.7కోట్లతో పనులు చేపట్టింది. అయితే పనుల పురోగతి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా మారింది. త్వరగా బ్రిడ్జి పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవచూపాలంటున్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి



ఈ వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి. వర్షాలు ఎక్కువ కురుస్తే ఈ వాగు నీరు పొలాల నుంచి పారి పంటలు పాడవుతాయి. అలాగే ప్రజలు, రైతులు రాకపోకలు సాగించేందుకు, వాహనాలు వెళ్లేందుకు వాగుపై రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ చూపాలి.

- అంజనేయులు, మాల సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షుడు

సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించాం



పనులకు బిల్లు రానందున కాంట్రాక్టర్‌కు పనులను నిలిపేశాడు. గ్రామస్తుల సమస్యలు, నిలిచిన పనుల అంశంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం.

- విజయ్‌కుమార్, డీఈఈ, పంచాయతీ రాజ్

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై5(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మహర్దశ పట్టిందని తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల మండలాల్లో శనివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. అనారోగ్యంతో మృతిచెందిన చంద్రాయన్‌పల్లికి చెందిన కసిరెడ్డి వసంతమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుమారుడు మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైనపాలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, పేదల ఆర్థికాబివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధిలో ప్రజలంతా పాలుపంచుకోవాలన్నారు. నియోజకర్గంలోని అన్ని గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించేందుకు కార్యాచరణను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రూ.600కోట్లతో రోడ్లను కొత్తగా వేస్తున్నట్లు వెల్లడించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించడంతో పాటు అధునాతన భవనాలు నిర్మిస్తున్నట్లు నారాయణరెడ్డి చెప్పారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం 8 సబ్ స్టేషన్లు, 650 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పనులనూ పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భట్టు కిషన్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, జగన్, సంపత్‌కుమార్, రమేశ్‌గౌడ్, తల్లోజు రామకృష్ణ, అంజన్‌రెడ్డి, బాబ,విజయ్ రాథోడ్, కల్లు రమణారెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్‌లో ఆధునిక పరిజ్ఞానం

- ఐటీ 2.0ద్వారా వేగవంతంగా సేవలు
- సౌత్ ఈస్ట్ డివిజన్ పోస్టాఫీసు సీనియర్ సూపరింటెండెంట్ హైమవతి



రంగారెడ్డి అర్బన్, జూలై5(ఆంధ్రజ్యోతి): ఐటీ 2.0 పేరుతో వినియోగదారులకు మరింత వేగవంతమైన, సమర్థవంత సేవలందించేందుకు పోస్టల్ శాఖ కృషి చేస్తోందని సౌత్ ఈస్ట్ డివిజన్ పోస్టాఫీసు సీనియర్ సూపరిండెంట్ హైమవతి శనివారం తెలిపారు. హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్‌లో ఈ సేవలు ఈ నెల 8నుంచి అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. జూలై 7న సౌత్ ఈస్ట్ డివిజన్ పరిధిలోని పోస్టాఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు జరగవని, వినియోగదారులు సహరించాలని ఆమె కోరారు.

శభాష్.. శ్యామల!

(ఐదో పేజీ తరువాయి..)

ఉద్భవించిన కవిరత్నం శ్యామల.. చిన్ననాటి నుంచి పుస్తక పఠనం, రచనలు చేయడం అలవాటు ఉన్న ఆమె రచయితగా ఎదిగారు.

సీనియర్ రీసెర్చ్ స్కాలర్‌గా..

తాండూరులో ఇంటర్ వరకు చదివిన శ్యామల హైదరాబాద్ అంబేద్కర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేసి ఆంధ్రమహిళా సభలో ఎల్ఎల్‌బీ చదివారు. ఉమెన్స్ రీసెర్చ్ సెంటర్‌లో సీనియర్ స్కాలర్‌గా పని చేశారు. ప్రస్తుతం మహిళా సాహిత్యం, సాధికారిత, సంస్కృతికంపై అధ్యయనం చేశారు.

శ్యామల రచనలు ఇవే..

వాడ పిల్లలు - తెలుగు కథలు అనేక భాషల్లో అనువాదం జరిగింది. ఆంగ్ల, మలయాళం, ఒరిస్సా భాషల్లో ప్రాచుర్యం పొందింది. నల్లపొద్దు, నల్లరేగడి సాళ్లు, అంకితం- కథా సంకలనం, ఏనుగంత తండ్రి కన్నా ఎకుల బుట్టంత తల్లి నయం, నేనే బలాన్ని- సదాలక్ష్మి బతుకు కథలు వంటివి ఆమె రచించారు.



రీసర్చ్ స్కాలర్‌గా పనిచేస్తున్న శ్యామల(ఫైల్)

అవార్డులు - పురస్కారాలు

2006లో ఉమ్మడి రాష్ట్రాల్లో తెలుగు భాషా సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాష విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. 2009లో తెలుగు యూనివర్సిటీ నుంచి వాసిరెడ్డి రంగనాయకమ్మ స్మారక పురస్కారం, రవి రాజు ట్రస్ట్ గండ పెండేరాన్ని శ్యామలకు బహూకరించారు. ఇండియా-ఆస్ట్రేలియా సొసైటీ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలో జరిగిన సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి శ్యామల హాజరై ఆ దేశంలో కవి సమ్మేళనంలో సన్మానం పొందారు. అలాగే గతంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళా పురస్కారాన్ని అందుకున్నారు. లండన్‌లోని గార్డెన్ పత్రికలో ఆమె గురించి వ్యాసం రావడం గమనార్హం.

ఫలించిన కృషి

- బషీరాబాద్ జూనియర్ కాలేజీలో 68 మంది విద్యార్థుల అడ్మిషన్లు



జూనియర్ కళశాలలో ప్రారంభమైన తరగతులు

బషీరాబాద్, జూలై5(ఆంధ్రజ్యోతి):బషీరాబాద్‌లో కొత్తగా ఏర్పాటైన జూనియర్ కళాశాలలో అడ్మిషన్లకు అధ్యాపకుల కృషి ఫలించింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.నర్సింహారెడ్డి నేతృత్వంలో అధ్యాపకులు ఏప్రిల్, మే నెలల్లో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థుల సమాచారాన్ని సేకరించారు. గ్రామాలకు వెళ్లి విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరాలని కోరారు. ఉత్తమ బోధన ఉంటుందని, పుస్తకాలు, డ్రెస్సులు అందజేస్తామని వివరించారు. ప్రైవేట్ కాలేజీల్లో చేరితే తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతుందని తెలియజెప్పారు. మండలానికి మంజూరైన జూనియర్ కాలేజీలో విద్యార్థుల్లేక గతేడాది ఇక్కడ అడ్మిషన్ పొంది తాండూరులో చదివారని, విద్యార్థుల సంఖ్య పెరిగితే మండల కేంద్రంలోనే కొనసాగుతుందని తెలిపారు. టెన్త్ ఫలితాలు వచ్చిన అనంతరం గ్రామాల్లో మరోసారి లెక్చరర్లు పర్యటించారు. కళాశాల ప్రారంభం రోజున 48 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇప్పుడు సంఖ్య 68కి చేరింది. బషీరాబాద్ జడ్పీ బాలుర పాఠశాలలో అదనపు గదుల్లో ఇంటర్ ఫస్టియర్ తరగతులు కొనసాగుతున్నాయి. కొత్త కాలేజీలో ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో పాటు అన్ని గ్రూపుల బోధనకు 8 మంది అధ్యాపకులు ఉన్నారు. టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు కూడా వచ్చాయి. ఈ క్రమంలో 100మంది వరకు విద్యార్థులను కాలేజీలో చేరే అవకాశాలు ఉన్నాయని, టెన్త్ పాసైన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లా డేందుకు అధ్యాపకులు యోచిస్తున్నారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో నిరీక్షణకు తెరపడగా, కాలేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

మంచాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): లింగంపల్లిగేటు వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే 96 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించామని చెప్పారు. మంచాల, లింగంపల్లి, నోముల, రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు ఇళ్లను కేటాయించామని చెప్పారు. పూర్తయిన ఇట్టి ఇళ్లకు తాగునీరు, విద్యుత్ సరఫరా కోసం రూ.30లక్షలు మంజూరు చేయించామని తెలిపారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో గృహ ప్రవేశాలు జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18నెలలైనా పనుల్లో పురోగతి లేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధికి పట్టింపే లేకుండా పోయిందని విమర్శించారు. గృహ నిర్మాణాలకు అనుసంధానంగా ఎన్ని శాఖలుంటాయో తెలియదని ఎద్దేవా చేశారు. పట్టించుకునే నాథుడు లేకనే లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారని, వీరిని కేసుల పేరుతో ఇబ్బంది పెట్టొద్దని పోలీసులను కోరారు.పెండింగ్ పనులు చేయకుంటే లబ్ధిదారులతో కలిసి ఆందోళనల్లో తానూ పాల్గొంటానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్, బహదూర్, సత్తు వెంకటరమణారెడ్డి, డి.రవి, బి.కిషన్‌రెడ్డి, గంట విజయ్, కరుణాకర్‌రెడ్డి,బాలరాజ్, అమరేందర్‌రెడ్డి, వీరేష్, చంద్రయ్య, మహేందర్, శంకర్, బద్రీనాథ్‌గుప్తా, జానీపాషా, జంగయ్య, శేఖర్, చెన్నయ్య, జంగారెడ్డి, నవాజ్, ఇందిర, నర్మద, పి.సుకన్య పాల్గొన్నారు.

కవల శిశువులకు దాతల చేయూత

ఆమనగల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ తండా వాసులు తమ ఉదారత చాటుకున్నారు. అనాథ పిల్లల వైద్య చికిత్సకు చేయూతనిచ్చారు. చిన్నారులకు తోడున్నామని మనోధైర్యాన్ని కల్పించారు. తండాకు చెందిన వివాహిత మధు ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త గోపి రిమాండ్‌లో ఉన్నాడు. దీంతో వారి కవల పిల్లలు(18 నెలలు) అనాథలయ్యారు. తాత సంరక్షణలో ఉన్న చిన్నారుల పోషణ ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు రూ.10వేలు, మాజీ ఎంపీపీ అనితవిజయ్ రూ.5వేలు, తండా వాసులంతా కలిపి రూ.52,800 పోగుచేసి శనివారం అందజేశారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా ప్రతీ నెల రూ.5వేలు ఇస్తామని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రకటించినట్లు రాములు చెప్పారు. నాయకులు కృష్ణ, తావుర్య, శంకర్, పాండు, విజయ్, రాజ్‌కుమార్, రమేశ్, మణిపాల్, రఘునాయక్, తండా యువకులు, తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న రాములు, విజయ్, నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో మెడిసిటీ కళాశాల పూర్వ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనాపూర్ మెడిసిటీ మెడికల్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మెడిసిటీ ఆస్పత్రిలో ఎంబీబీఎస్ చేసి ప్రపంచ నలుమూలన స్థిరపడి వైద్య సేవలందిస్తున్న 25మంది డాక్టర్లు(పూర్వ విద్యార్థులు) ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. మెడిసిటీ మెడికల్ కళాశాల 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడిసిటీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ రెడ్డి స్వాగతం పలికారు. మెడిసిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రొఫెసర్ శివ రామకృష్ణ పూర్వ విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రపంచ నలుమూలలా వైద్యసేవలు అందిస్తున్న పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలేంద్ర పాల్గొన్నారు.

ఎల్లంపేటలో పశువైద్య శిబిరం



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

మేడ్చల్ టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపేట మున్సిపాలిటీలో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్‌గా పశువులకు సోకే రోగాల పట్ల పశుపెంపకదారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. పాడి పరిశ్రమలు నిర్వహించే వారు పాల దిగుబడి అధికంగా పొందడానికి పశువులను ఆరోగ్యవంతంగా ఉంచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, యోగేష్ పటేల్, అరోరా పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీసెల్ మండల అధ్యక్ష పదవికి పోటాపోటీ

బషీరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బషీరాబాద్ మండల ఎస్టీసెల్ అధ్యక్ష పదవికి ఆ పార్టీ నాయకుల మధ్య పోటాపోటీ నెలకొంది. మండల కేంద్రంతో పాటు ఆయా గిరిజన తండాల నుంచి 20 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఈ పోటీలో సూర్యానాయక్ (టాకీతండా), చవాన్‌గోపాల్ (పర్యానాయక్‌తండా), జయరాం(జమ్లానాయక్‌తండా), నథోడ్‌నవీన్ (మంతన్‌గౌడ్, రథోడ్ సురేష్(బషీరాబాద్)లతో పాటు మరో 15 మంది పార్టీ శ్రేణులు రేసులో ఉన్నారు. ఈ పదవికి ఆశావహులు పలువురు పోటాపోటీగా దరఖాస్తులు చేసుకోవడంతో ఎస్టీసెల్ పదవికి తీవ్ర పోటీ ఉంది. ఆ పార్టీ యువ నాయకుడు సూర్యనాయక్ పదవిని ఆశిస్తున్నాని, ఎమ్మెల్యే సోదరుడు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ఆశీర్వాదం తనపై ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో మొహర్రం సందడి



ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు

చౌడాపూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలను గ్రామాల్లో ఘనంగా జరుపుకుంటున్నారు. చౌడాపూర్ మండలంలోని మందిపాల్ గ్రామంలో పీర్ల మసీదుల్లో ఏర్పాటు చేసిన పీర్లను భక్తులు దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం(నేడు) మొహర్రం పండుగ సందర్భంగా గ్రామాల్లో పీర్లను ఊరేగించి నిమజ్జనం చేయనున్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి



జెండాను ఎగురవేసిన యూనియన్ నాయకులు

కొడంగల్ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రెవల్యూషనరీ విద్యార్థి సంఘం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు భీమారాజు అన్నారు. కొడంగల్‌లో ఆర్ఎస్‌యూ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు మోహన్, మహేష్, వెంకటేష్, శ్రీలత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న.. పోషకాలు మిన్న



మార్కెట్‌లో విక్రయిస్తున్న మొక్కజొన్న

మర్పల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిటపట చినుకులు పడుతుంటే.. మొక్కజొన్న కంకులు కాల్చుకుని గానీ, ఉడికించి గానీ తింటే ఆ మజానే వేరు కదా. రుచిగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మొక్కజొన్నలో అనేక రకాల పోషకాలు దాగి ఉన్నాయి. న్యూట్రియంట్లతో పాటు విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడం, వ్యాధులపై పోరాడే శక్తిని మొక్కజొన్న పెంపొందిస్తుంది. ఆరోగ్య ప్రయోజనాల రీత్యా తరచూ మొక్కజొన్నతో చేసిన ఆహార పదార్థాలను తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఎముకలను బలంగా మార్చడంతో పాటు కిడ్నీలో రాళ్ల



ఉడకబెట్టిన మొక్కజొన్న

రాకుండా నివారించడంలో దోహదపడుతుంది. మొక్కజొన్నలో విటమిన్ బీ12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ సమృద్ధిగా ఉంటాయి. శరీరంలో ఎర్రరక్త కణాల ఉత్పత్తికి ఎంతో సహాయ పడతాయి. రక్తహీన ముప్పు రాకుండా తగు మోతాదులో న్యూట్రియంట్లను సరఫరా చేయడంలో మొక్కజొన్న దోహదం చేస్తుంది. వయసు, ఎత్తుకు తగిన బరువు లేనివారి విషయంలో మొక్కజొన్న దివ్య ఔషదంలా పని చేస్తుంది. మొక్కజొన్నలో విటమిన్లు, లైకోపిన్ (యాంటి ఆక్సిడెంట్లు) పుష్కలంగా ఉంటాయి. దీంతో కొలిజిన్ ఉత్పత్తి పెరుగుతుంది. యూవీ కిరణాల జనిత ఫ్రీ రాడికల్స్‌తో చర్మానికి హాని కలగకుండా నివారిస్తుంది. సౌందర్య కారక ఉత్పత్తుల్లో మొక్కజొన్న గింజల నుంచి తయారు చేసే నూనెను వినియోగిస్తారు. అందుకే మొక్కజొన్నను చిరుతండిగా, ఛాట్, సూప్ తదితర వాటిల్లో చేర్చుకొని హాయిగా తినొచ్చు. అదే విధంగా మొక్కజొన్న గింజల్లో సమృద్ధిగా కెరొటినాయిడ్స్ ఉంటాయి. దీంతో నేత్ర సంబంధిత సమస్యలు పరిష్కారం అవుతాయి. జీర్ణక్రియను మెరుగుపర్చుతూ చిన్న ప్రేగుల పనితీరును క్రమబద్ధీకరిస్తుంది.

వర్షాకాలం భలే గిరాకీ



వర్షాకాలంలో మొక్కజొన్నకు భలే గిరాకి ఉంటుంది. ప్రతీ ఒక్కరూ మొక్కజొన్న తినేందుకు ఆసక్తి కనబరుస్తారు. వర్షంలో వేడివేడిగా ఉడకబెట్టిన, కాల్చిన మొక్కజొన్నకు గిరాకీ బాగుంటుంది. మొక్కజొన్న వ్యాపారంతో ప్రతీ రోజు రూ.1000 నుంచి రూ.1500 వరకు సంపాదనకు అవకాశం ఉంటుంది.

- రవి, వ్యాపారి

కళాశాలలకు మహర్దశ!

(ఐదో పేజీ తరువాయి)



దృష్టికి తీసుకు వెళ్లారు. కళాశాలల్లో వివిధ రకాల పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.1,30,37,375, విద్యుత్ మరమ్మతుల కోసం రూ.12,05,710, తాగునీటి సరఫరా, శానిటరీ పనులకు రూ.16,73,858 నిధులు కేటాయించింది. పన్నులు, జీఎస్టీ, ఎంఎస్‌పీఎస్ చార్జీల కింద రూ.41,13,058 కేటాయిస్తూ నిధులు మంజూరు చేసింది.

కళాశాలల వారీగా

జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మొత్తం రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవనాలకు సివిల్, విద్యుత్, శానిటరీ మరమ్మతు పనులు చేపట్టడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు అవసరమైన కళాశాలల్లో, గ్రీన్ బోర్డులు, డ్యుయల్ డెస్కులు వంటి సౌకర్యాలు కల్పిస్తారు. అవసరమైన కళాశాలలకు వైట్ వాష్ కూడా చేయిస్తారు. బోర్‌వెల్, ప్రహరీల నిర్మాణం వంటివి కూడా చేపట్టనున్నారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులతో ఈ పనులకు సంబంధించిన అంచనాలతో నివేదికలు తయారు చేసి కలెక్టర్‌కు అందజేయనున్నారు. కలెక్టర్ ఆమోదం పొందిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ఈ పనులు చేపడతారు. ఇంటర్ విద్య నోడల్ అధికారి జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకుంటూ పనులు త్వరగా పూర్తయ్యే విధంగా పర్యవేక్షిస్తారు.

నిర్వహణ నిధులకూ గ్రీన్ సిగ్నల్...!

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మరమ్మతులు, ఇతర సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల నిర్వహణకు అవసరమయ్యే నిధులను కూడా కేటాయించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయిస్తున్న బొటాబొటి నిధులు స్టేషనరీ కొనుగోలు చేసేందుకు కూడా సరిపోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం విడుదల చేసే నిధులు సరిపోకపోవడంతో ప్రిన్సిపాళ్లు తమ చేతి నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కో కళాశాల నిర్వహణకు ప్రతీనెలా కనీసం రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చు అవుతోందని కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు. చాలా వరకు ప్రభుత్వ కళాశాలల్లో అటెండర్లు, స్వీపర్లు, స్కావెంజర్లు లేకపోవడంతో ఆ పనులు చేపట్టేందుకు ప్రిన్సిపాళ్లు ఇతరులపైన ఆధార పడడమో లేక తామే చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. క్షేత్ర స్థాయి పరిస్థితులను తెలుసుకున్న ఉన్నతాధికారులు విద్యార్థుల సంఖ్య ఆధారంగా మేరకు కళాశాలలకు రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు మంజూరు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు చెబుతున్నారు. నిర్వహణ ఖర్చులకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు కూడా జారీ కానున్నట్లు సమాచారం.

జోరుగా వరినాట్లు

(ఐదో పేజీ తరువాయి)

ఇప్పుడిప్పుడే నాట్లు వేస్తున్నారు. ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు దొడ్డురకాలు ఎంటీయు 1010, కావేరి 468, ఎంపీ 3030, పయనీరు రకాలను, సన్నరకాలైన బీపీటీ 5204, వరంగల్ 14, జీకే చేతన వంటి

సీజన్ ప్రారంభంలోనే నారు పోసుకున్నాం



వానాకాలం సీజన్ ప్రారంభంలోనే నారుపోసుకున్నాం. నాకున్న ఆరు ఎకరాల్లో దొడ్డు రకాలను 5 ఎకరాలు, తిండికోసం ఎకరంలో సన్న రకాన్ని నాటు వేశాను. సీజన్ రాకముందే వర్షాలు కురిశాయి. నాటు వేసిన తర్వాత వర్షాలు కురవడం లేదు. వర్షం కురిస్తే రోగాలు సోకకుండా వరిపైరు ఏపుగా పెరుగుతుంది.

- ఏనుగు పద్మారెడ్డి, రైతు అవుశాపూర్



నాటు వేయడానికి ట్రాక్టర్‌తో పొలాన్ని చదును చేస్తున్న రైతు

అందుబాటులో ఎరువులు



వానాకాలం సీజన్‌కు అవసరమైన మేర ఎరువులను అందుబాటులో ఉంచాం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఘట్‌కేసర్‌లోని రైతు సేవా సహకార సంఘం, ఎదులాబాద్‌లోని ఉపకేంద్రంలో ఎరువులు ఉన్నాయి. యూరియా డీఏపీ, పొటాష్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులు తగిన మోతాదులోనే ఎరువులు వాడుకోవాలి. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలి.

- లావణ్య, మండల వ్యవసాయ అధికారిణి

రకాలను సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ రైతు సేవాసహకార సంఘం, ఎదులాబాద్‌లోని ఉప కేంద్రంలో యూరియా, పొటాష్, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉంచారు. రైతులు తమ భూమి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొస్తే ఎరువులు ఇస్తారు.

ముగిసిన బీఎల్‌వోల శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని గుర్తుంచుకుని విధి నిర్వణలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. రెండు రోజులు జరుగుతున్న బూత్‌లెవల్ అధికారులు శిక్షణ శనివారంతో ముగిసింది. తాండూరు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ నంబర్-1 పాఠశాలలో మండలంలోని ఆయా గ్రామాల్లో 18ఏళ్ల నిండిన వారిని ఓటరు నమోదుపై బూత్‌లెవల్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. శిక్షణలో చెప్పిన విధంగా బూత్ లెవల్ అధికారులు తాండూరు మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి 18ఏళ్లు పైబడిన వారిని ఓటరు నమోదు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ లలిత, ఆర్ఐ గోపి, మాస్టర్ ట్రైనర్లు ముస్సావీర్ పాల్గొన్నారు.

తాగునీటి కటకట

మూడుచింతలపల్లి, జూలై 5, (ఆంధ్రజ్యోతి): ఉద్దెమర్రిలో మూడు రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయితీలుగా ఉన్నప్పుడే అధికారులు సమస్యలపై దృష్టి సారించారని, ఇప్పుడు మున్సిపాలిటీగా ఏర్పడ్డాక సమస్యలను గాలికి వదిలేశారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు నీటిసమస్యపై విన్నపించుకున్న పట్టించుకోకపోవడంతో బిందెడు నీటికోసం గ్రామస్తులు, మహిళలు అష్టకష్టాలు పడుతున్నారని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్దెమర్రి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పర్యవేక్షణ లోపం.. తుప్పుపట్టిన యంత్రం



తుప్పుపట్టిన ఎగవేత యంత్రం

కొడంగల్ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్షలాది రూపాయల యంత్రం తుప్పుపట్టి పాడవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. యాసంగి, ఖరీఫ్ సీజన్‌లలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి తూకం వేస్తారు. ధాన్యంలోని దుమ్ము, చిన్న రాళ్లు పోవడానికి ఎగవేత యంత్రం వినియోగిస్తారు. అలాంటి యంత్రాన్ని కొడంగల్ ఐకేపీ కార్యాలయం ముందు వృధాగా పడేశారు. ఎండకు ఎండుతూ వర్షానికి తడసి ఆ యంత్రం తుప్పుపట్టింది. లక్షలాది రూపాయలతో తీసుకొచ్చిన యంత్రం వినియోగించేందుకు పనికి రాకుండ పోవడంతో అధికారుల నిర్లక్ష్యంతో యంత్రం మూలకు చేరిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఆషాఢ శుద్ధ ఏకాదశి పూజలు

కొడంగల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చాతుర్మాస ఆషాఢ శుద్ధ ఏకాదశి పూజలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ హీరాలాల్ తెలిపారు. కొడంగల్ పట్టణంలోని సంపూర్ణ ఆయుర్వేదిక్ క్లినిక్‌లో శనివారం సత్సంగ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాతుర్మాస పూజల గురించి వివరించారు. ప్రతీ గురువారం సత్సంగ సభ్యుల నివాసంలో చాతుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 6 నుంచి నవంబరు 1 వరకు 4 నెలల పాటు ప్రతీ గురువారం రాత్రి 8:30 నుంచి 11 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్ టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణం కిష్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంఆర్‌పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

ధారూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టేపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి స్వామిదాస్ మాదిగ తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జె.లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా శంకర్, సి.లక్ష్మయ్య, కోశాధికారిగా నర్సింహులును, కార్యవర్గ సభ్యులను నియమించినట్లు ఆయన చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సేవింగ్స్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

ఘట్‌కేసర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడానికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు నిరంతరం కృషి చేస్తుందని ట్రస్టు ప్రతినిధులు సుందర్ రావు, మాజీ కౌన్సిలర్ రమాదేవి అన్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన గుంట రమేష్ కుటుంబ సభ్యులకు ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రూ.20వేల పోస్టాఫీసు సేవింగ్స్ సరిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ.. ఎక్కడ ఎవరు ఇబ్బందుల్లో ఉన్నా తమ ట్రస్టు పరిశీలించి తమ శక్తి మేరకు ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, వీరారెడ్డి, రామయ్య, సోమయ్య, గీత, హేమలత, సంతోష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నర్సింహులు(ఫైల్)

పరిగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని బాసుపల్లి గ్రామానికి చెందిన అటికె నర్సింహులు(22), రాఘవేందర్‌లు కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా సయ్యదమల్యాపూర్ శివారులో శుక్రవారం ఎదురుగా వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంగతి విదితమే. అటికె నర్సింహులు వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని పరిగి ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. రాఘవేందర్ పరిస్థితి మెరుగ్గానే ఉందని, ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పొల్కంపల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో కరీం

పరిగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిగి ఎంపీడీవో ఎంఎ కరీం అన్నారు. మండలంలోని పేటమాదారం, మాదారం, పొల్కంపల్లి గ్రామాలను శనివారం పర్యటించారు. పంచాయితీల్లో రికార్డులను పరిశీలించారు. ముఠికికాలువలు, నర్సరీలు, ప్లాంటేషన్‌లను పరిశీలించారు. పొల్కంపల్లి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కవిత, వెంకట్‌రెడ్డి, దానమ్మ, ఫీల్డ్‌అసిస్టెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరిగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పరిగిలోని కొడంగల్ చౌరస్తాలో రోడ్డుపై నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాకలి అనిల్ మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయని కారణంగా విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి బలవంతంపు వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, గణేశ్, మహేశ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు యాలాల మండలం పగిడ్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రఘురాంరెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. పగిడ్యాల గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు వారు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సంపత్, గ్రామస్తులు నర్సింహులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి



అధికారులకు వినతిప్రతం అందజేస్తున్న హెచ్‌ఎం

తాండూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్లాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమస్యలపై ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామానికి చెందిన కొంతమందితో కలిసి సూపరింటెండెంట్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా వంటగది లేక విద్యార్థులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి



శిక్షణా తరగతుల కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

యాలాల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10, 11వ తేదీల్లో కేవీపీఎస్ జిల్లా స్థాయి సామాజిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం కులవివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో శిక్షణ తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం వల్ల దళితులకు ఒరిగిందేమీలేదని వాపోయారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న దళిత యువకులు ఏఒక్క పథకానికి నోచుకోవడం లేదని, ఇంటిగ్రేటెడ్ స్కూల్ పేరుతో ప్రస్తుతం ఉన్న గురుకులాలను ఎత్తివేయడం మానుకోవాలన్నారు. అదేవిధంగా నాణ్యమైన విద్య, వైద్యం అందరికీ అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 10, 11వ తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగే తరగతులకు జిల్లా వ్యాప్తంగా 600 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు మల్కయ్య తెలిపారు. ఈ తరగతులకు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబుతోపాటు రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ నాయకులు బస్వరాజ్, కృష్ణ, మల్లేశం, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.